క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. డ్రీమ్‌వ్యాలీ, ఆదర్శనగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. ఫీడర్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కోత అమలులో ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

అన్ని కులాలకు 'బీసీ బంధు' వర్తింపజేయాలి

శంషాబాద్ రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకాన్ని అన్ని కులాల బీసీలకు వర్తింప చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన ఉపాధ్యక్షుడు సీహెచ్.మహేందర్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని కులాలను మాత్రమే ఈ పథకానికి అర్హులుగా చేర్చడం తగదన్నారు. పథకం కోసం దరఖాస్తు చేసుకునే గడువు పొడగించాలన్నారు. ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే ప్రభుత్వం ఈ పథకాన్ని తెరపైకి తెచ్చిందని ఆయన ఆరోపించారు. బీసీలోని అన్ని వర్గాలకు ఈ పథకాన్ని వర్తింప చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: విద్యార్థులకు చిన్ననాటి నుంచే చదువు ప్రాముఖ్యతను తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని డాక్టర్ ఎం.సాయిచరణ్‌రెడ్డి అన్నారు. ఉప్పర్‌పల్లిలోని చైతన్య విల్లాస్ కాలనీ రామాలయంలో ఆదివారం ఆయన విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనకదుర్గ, ఎం.వనిత రెడ్డి, తెలంగాణ ప్రాంత సంయోజిక్ పద్మశ్రీ, అనీష్, సుభాష్, లింగం పాల్గొన్నారు.

'ఐఎస్‌బీ'లో పుస్తక పరిచయ కార్యక్రమం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఆదివారం సాయంత్రం పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఐఎస్‌బీలోని ఖేమ్కా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌బీ వ్యవస్థాపక డీన్, హరప్పా ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ప్రమత్ రాజ్ సిన్హా రచించిన 'లెర్న్, డోంట్ స్టడీ' అనే పుస్తకాన్ని ప్రస్తుత ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల ఆవిష్కరించి, పరిచయం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమత్ రాజ్‌సిన్హా, ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల మధ్య ప్రత్యేక సంభాషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సిన్హా మాట్లాడుతూ వృత్తిపరమైన జీవితంలో అత్యంత ముఖ్యమైన, సవాల్‌గా మారిన సమస్యలను ఎదుర్కొంటున్న యువత కోసం ఉత్తమమైన, అత్యంత ఆచరణాత్మకమైన సలహాలను పొందుపరిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఐఎస్‌బీ ఏర్పాటు, సాధించిన ప్రగతి తదితర అంశాలతోపాటు పుస్తకం ప్రాధాన్యతపై ఇద్దరి మధ్య ఆసక్తికరమైన సంభాషణలు సాగాయి. పలువురు ఐఎస్‌బీ ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం తగదు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్ యాదవ్ అన్నారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన పలువురు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి హైదరాబాద్ నుంచి ఆదాయం వస్తుండగా, హైదరాబాద్‌కు శేరిలింగంపల్లి నుంచే ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఆదాయం వచ్చే ప్రాంతాల్లోనూ మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. రోడ్లు, డ్రైనేజీ, మంజీరా పైప్ లైన్లు, ఇళ్ల పట్టాలు, వీధి దీపాల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, ట్రైబల్ యూనివర్సిటీ, గిరిజన బంధు పథకాల ఊసేలేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చే హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాము అందుబాటులో ఉంటామని బరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, అనీల్, అరుణ, ఆశీష్, సాయి, దిలీప్, లోకేష్, వెంకట్, దీక్షిత్, ఆకాశ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

- ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్
- రాజేంద్రనగర్‌లో మరో నాలుగు నెలల్లో ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా



మంచినీళ్ల పండుగలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లల్లో చేసిన రాష్ట్ర ప్రగతి, సంక్షేమ పథకాలు చూసి మూడో సారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి సామా భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జలమండలి ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే చీకటి తెలంగాణగా మిగిలిపోతుందని ఎద్దేవా చేశారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్ల కృషి ఫలితంగా రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులు పూర్తయ్యాయని, 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో పాటు సాగునీటితో ప్రతి చెరువు కళకళలాడుతుందన్నారు. పాలమూరు, రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు పూర్తయితే రెండు జిల్లాల్లో సాగునీరు తాగునీటికి కొదవ ఉండదన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పైప్‌లైన్ పనులను పూర్తి చేసి నాలుగు నెలల్లో ఇంటింటికి మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జలమండలి అధికారులు ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యతాయుతంగా పని చేస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం



కార్యక్రమంలో పాల్గొన్న జలమండలి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు

చర్యలు తీసుకుందన్నారు. అభివృద్ధిని చూసి ప్రజలు కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ మాట్లాడుతూ అత్తాపూర్ డివిజన్‌లో జలమండలి అధికారులు ప్రజలకు సంపూర్ణ డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తూ సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. అధికారుల పనితీరు అద్భుతంగా ఉందని పెండింగ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు సమయపాలనతో కూడిన స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి సీజీఎం విజయరావు, రాజేంద్రనగర్ డివిజన్ డీజీఎం జమీల్, మేనేజర్లు రామ్‌నర్సింహ్మారెడ్డి, ఖాదర్, శ్రావ్యరెడ్డి, వినాయక్, జావిద్, వనం శ్రీరామ్‌రెడ్డి, పోరెడ్డి ధర్మారెడ్డి, టి.ప్రేమ్‌గౌడ్, కోలన్ సుభాష్‌రెడ్డి, జాలిగం చిత్తారీ, సరికొండ వెంకటేష్, రఘుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విష్ణుప్రియ, హరిప్రియ నృత్యం..

మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో బి.హరిప్రియ, విష్ణుప్రియ భారతనాట్య ప్రదర్శన సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విష్ణుప్రియ, హరిప్రియలను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జలమండలి ఉద్యోగులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

'బీఆర్‌ఎస్‌కు మళ్లీ అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తారు'



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

రాజేంద్రనగర్: రెండు పర్యాయాలు అవకాశం బీఆర్‌ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మరో సారి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. రాజేంద్రనగర్ కట్ట మైసమ్మ ఆలయం వద్ద రాజేంద్రనగర్ నియోజకవర్గం రిటైర్డ్ ఉద్యోగులతో మాట ముచ్చట సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో 1వ తేదీ రాగానే జీతాలు చెల్లించేవారన్నారు. ప్రస్తుతం రెండు నెలలు గడుస్తున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షులు ఖలీద్, నాయకులు, కార్యకర్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న జంపాల నరసింహ

బండ్లగూడ: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని జంపాల నరసింహ సేవా సమితి అధ్యక్షులు జంపాల నరసింహ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ, విశ్వరూపనగర్‌లోని శ్రీ సరస్వతీ బాల సంస్కార కేంద్రం బాల బాలికలకు ఆదివారం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. శ్రీ శారదాధామంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం విశ్వరూపనగర్‌లోని బాలబాలికలకు ప్రతి రోజు సాయంత్రం ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం ద్వారా నిర్వహిస్తున్న బాల సంస్కార కేంద్రం ద్వారా చక్కటి సంస్కారాలు అందుతున్నాయన్నారు. బాల బాలికలకు కావాల్సిన సదుపాయాలను అందించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంచినీళ్ల పండగ



మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కల్పన సింహారెడ్డి

శంషాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో తాగు నీటి కష్టాలు పూర్తిగా తొలగిపోయాయని ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ననాజీపూర్‌లో నిర్వహించిన మంచి నీళ్ల పండగ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. గతంలో మంచి నీళ్ల కోసం మహిళలు ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కల్పన సింహారెడ్డి మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వసంతలక్ష్మి, ఎంపీఓ ఉషాకిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ, ఉపసర్పంచు కృష్ణ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, విఠల్‌గౌడ్, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థికి జేఈఈ ర్యాంక్

రాజేంద్రనగర్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి రామావత్ శివశంకర్ ఎస్టీ కేటగిరిలో ఆల్ ఇండియా 581వ ర్యాంకు సాధించాడు. శివశంకర్ తల్లిదండ్రులు కూలీ పని చేసుకుంటూ రాజేంద్రనగర్ ప్రభుత్వ కళాశాలలో చదివిస్తున్నారు. శివశంకర్ కష్టపడి చదివి ఆల్ ఇండియా స్థాయిలో జేఈఈలో ర్యాంకు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య అతడిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మాన్య, స్వప్న, కిరణ్‌కుమార్, పరశురాములు, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, మురళీ, కరుణాకర్, పార్థసారధి, శశిధర్, భరత్, నర్సింగ్, కుమార్, రఫీ, పర్వీన్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



బెల్టులు ప్రదానం చేస్తున్న దృశ్యం

మణికొండ: చిన్నారులకు కరాటే శిక్షణ ఇప్పిస్తే క్రమశిక్షణ అలవడటంతో పాటు, ఆత్మరక్షణ సాధనంగా ఉపయోగపడుతుందని కరాటే గ్రాండ్ మాస్టర్ మొయినుద్దీన్ అన్నారు. ఆదివారం మణికొండ విక్టరీ తైక్వాండో అకాడమీలో జరిగిన కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకుంటే ఆత్మవిశ్వాసంతో జీవించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలకు తప్పనిసరిగా కరాటే నేర్పించాలన్నారు. కార్యక్రమంలో కోచ్ వెంకటేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గాలిపోచమ్మ దేవాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సుబ్రహ్మణ్య డెవలపర్స్ చైర్మన్ కడారి జనార్ధన్‌రెడ్డి

బండ్లగూడ: మానవుడి మనుగడకు దైవచింతన ఎంతో ఉపయోగపడుతుందని సుబ్రహ్మణ్య డెవలపర్స్ చైర్మన్ కడారి జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో నిర్మించనున్న గాలిపోచమ్మ దేవాలయానికి సుబ్రహ్మణ్య డెవలపర్స్ తరపున రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో చరిత్రాత్మకమైన గాలిపోచమ్మ దేవాలయాన్ని అధునాతన పద్ధతిలో నిర్మించాలన్నారు. తమవంతు బాధ్యతగా దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేశామన్నారు. దేవాలయ అభివృద్ధికి రానున్న రోజుల్లో మరిన్ని సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ తీర్మానం



మాట్లాడుతున్న అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి నెలలు గడుస్తున్నా అధికారులు రోడ్డు విస్తరణ విషయాన్ని పట్టించుకోవటం లేదని, అనునిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను తగ్గించాలంటే రోడ్ల విస్తరణే శరణ్యమని, వెంటనే పనులు చేపట్టాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ తీర్మానం చేసింది. ఆదివారం అధ్యక్షుడు డి.సీతారాం అధ్యక్షతన పంచవటి కాలనీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో పలు కాలనీలవాసులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్లపైకి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని, గంటల తరబడి ట్రాఫిక్ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.60కోట్ల నిధులను కేటాయించిందని, ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సైతం పనులను చేపట్టాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. రోడ్లపై ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని వాటిని పక్కకు తొలగించాలన్నారు. హుడాకాలనీ కమ్యూనిటీ హాల్ విస్తరణ, మారుతీనగర్, కే పీఆర్ కాలనీలల్లో పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. పైప్‌లైన్ రోడ్డులోని శివసాయి కాలనీకి రోడ్డు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ప్రైవేటు ప్లాట్ లోనుంచి రాకపోకలు సాగిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని, వాటిపై మున్సిపాలిటీకి రాతపూర్వకంగా ఫిర్యాదులు చేయాలని నిర్ణయించారు. ఇటీవల హుడాకాలనీ, భాగ్యలక్ష్మి కాలనీ, కేపీఆర్‌కాలనీ, హనుమాన్‌నగర్ కాలనీలలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, అధికారులను కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు, కోశాధికారి బాబురావులతో పాటు పలు కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి వర్షపు బొట్టును ఒడిసిపట్టాలి

గోల్కొండ: నీరు ఎంతో విలువైందని, భూగర్భ జలాలను కాపాడుకోవడానికి భూమిపై కురిసిన ప్రతి వర్షపు బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాల నీటిమట్టాన్ని పెంచుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వర్షపునీటి గుంతలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి వనరులు కూడా పెరగాలని దీని కోసం ఇంకుడుగుంతల ఏర్పాటు తప్పనిసరి అని ఆయన అన్నారు. నీరు ఎంతో విలువైందని, సకలమానవాళికి నీరే జీవనాధారం అని ఆయన అన్నారు. కాలనీలోనే కాకుండా బస్తీలలో సైతం ఇంకుడుగుంతల ఏర్పాటు బస్తీ కమిటీ, కాలనీ సంక్షేమ సంఘాల వారు పాటుపడాలని ఆయన అన్నారు. ప్రభుత్వం కూడా నీటిగుంతల ఏర్పాటుకు ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు



లక్ష్మినగర్ పార్కులో బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్

అత్తాపూర్: పార్కుల్లో అభివృద్ధి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటునంనట్లు అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ లక్ష్మినగర్ కాలనీలో పార్కులకు నీటి సరఫరా లేకపోవడంతో చెట్లు ఎండిపోతున్నాయి. దీంతో కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి సమస్యను తీసుకురావడంతో వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి నూతన బోరు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆదివారం బోర్ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కులో బోరు చెడిపోవడంతో చెట్లు ఎండిపోతున్నాయన్నారు. స్థానికుల వినతి మేరకు కొత్త బోరు వేసేందుకు అధికారులతో చర్చలు జరిపామన్నారు. అధికారులు స్పందించి కొత్త బోరు ఏర్పాటు చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో లక్ష్మినగర్ కాలనీ అధ్యక్షులు మూర్తి, స్వామి, కృష్ణారెడ్డి, వనం నర్సింహ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఐస్‌క్రీం తయారీ కేంద్రంపై దాడి



స్వాధీనం చేసుకున్న ముడిసరుకు



రాజేంద్రనగర్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇంట్లో చిన్న పిల్లలు తినే ఐస్‌క్రీమ కోన్‌లను తయారు చేస్తున్న తల్లి, కొడుకులను ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా ముడిసరుకులు స్వాధీనం చేసుకుని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుద్వేల్ వెంకటేశ్వర కాలనీకి చెందిన మహాలక్ష్మి ఇంట్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఐస్‌క్రీమ కోన్‌లను తయారు చేసి, వాటిని నగరంతో పాటు ఇతర జిల్లాలకు సరఫరా చేస్తుంది. ఇందుకు ఆమె కుమారుడు మహేష్ సహకరించేవాడు. దీనిపై సమాచారం అందడంతో శనివారం రాత్రి ఎస్ఓటి పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుని ముడిసరుకు స్వాధీనం చేసుకున్నారు. కేసును తదుపరి విచారణ నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన్‌కీబాత్‌ను వీక్షించిన బీజేపీ నేతలు



మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వీక్షించారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్, నల్లింగ రమేష్, సులిగె కరుణాకర్, జగన్, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు. మన్‌కీబాత్ సందర్భంగా ప్రధాని మోదీ సందేశాన్ని వారు వివరించారు. నీటి సంరక్షణ కోసం ప్రతి భారతీయుడు నడుంబిగించాలని పూర్వం నీటి సంరక్షణ కోసం ఛత్రపతి శివాజీ మహరాజ్ గుంటలు, చెరువుల తవ్వించారని ప్రపంచానికి నీటి సంరక్షణను పరిచయం చేసిన వారి నిర్వహణ నైపుణ్యాలను నేర్చుకుని భవిష్యత్ కార్యాలకు మార్గదర్శనం చేసేలా ప్రతి ఒక్కరు నీటి సంరక్షణ చేయాలని కోరారన్నారు.

ప్రధాని సూచనలు పాటించాలి



రాజేంద్రనగర్‌లో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్‌లోని 4వ బూత్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. శక్తికేంద్రం ఇన్‌చార్జీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ఆధ్వర్యంలో బూత్ నెంబర్ 173లో సీనియర్ నాయకులు భాస్కర్‌యాదవ్ ఇంట్లో తిలకించారు. శ్రీధర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎన్నో ఉపయోగకరమైన సందేశాలు అందిస్తున్నారని, వాటిని అందరూ ఆచరించాలన్నారు. రైతులు, కార్మికులు, ప్రజల శ్రేయస్సు కోసం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు జి.బాబురావు, ఎస్సీ మోర్చా డివిజన్ అధ్యక్షులు మల్లేష్, సీనియర్ నాయకులు నర్సింహ, వేణు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోటలో మెట్టు మెట్టుకూ బొట్టు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను పురస్కరించుకుని ఆదివారం కోటలోని నగీనాబాగ్ నుంచి అమ్మవారి ఆలయం వరకు ఉన్న మెట్లకు బొట్లు పెట్టి పూజలు నిర్వహించారు. గోల్కొండ కోట బోనాల ఆషాఢమాస జాతర ఉత్సవాలను పురస్కరించుకుని కోట మెట్లకు అలంకరణ చేయడం ఆనవాయతీగా వస్తుంది. ఇందులో భాగంగానే గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయం అమ్మవారి వృత్తిపని సంఘం ఆధ్వర్యంలో మెట్లకు బొట్టు పెట్టే కార్యక్రమం జరిగింది. అమ్మవారి బోనాలకు వారం రోజుల ముందుగానే బొట్ల కార్యక్రమం నిర్వహిస్తామని పూజారి సాయిబాబాచారి అన్నారు.

బోనాల జాతరకు భారీ బందోబస్తు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తామని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కోట బోనాల పూజ, ఆహ్వానపత్రంతో పాటు నజర్ బోనంకు బందోబస్తును ఏర్పాటు చేయాలని నజర్ బోనం నిర్వాహకులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. కోట బోనాలను రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున నిర్వహిస్తుందని ఇందుకు పోలీస్ శాఖ సైతం అంతే స్థాయిలో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోల్కొండ రిసాలబజార్ నుంచి ప్రారంభంకానున్న మహంకాళి అమ్మవారి నజర్ బోనం ఊరేగింపునకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బోనం నిర్వాహకులు, శ్రీజగదాంబిక మహంకాళి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఇన్‌స్పెక్టర్‌ను కోరారు.

అభివృద్ధి చేస్తేనే ప్రజలు ఆదరిస్తారు



ప్రజాప్రతినిధులను సన్మానించిన మణికొండ గార్డెన్ వాసులు

మణికొండ: ప్రజలు అడిగిన పనులను చేస్తేనే వారు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదరిస్తారని, వారి మన్ననలు పొందేలా పనులు చేయటమే తమ విధి అని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గార్డెన్ కాలనీలో ఇటీవల అనేక అభివృద్ధి పనులు చేపట్టడంతో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మున్సిపల్ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో నిధుల లభ్యతను బట్టి అన్ని కాలనీలను సమాన దృష్టితో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొన్ని పనులు కొందరి అడ్డంకితోనే ఆలస్యం అవుతున్నాయని, అలాంటి వారిని సముదాయించాల్సిన బాధ్యత కాలనీ వాసులపై ఉంటుందన్నారు. మణికొండ గార్డన్‌లో డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి పైప్ లైన్లు, వీధి దీపాలు తదితర పనులను చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో రోడ్లకు ప్యాచ్ వర్క్‌లతో పాటు గండిపేట క్యాండూట్ వారీగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్.వందనగేష్, బి.శ్వేత రవికాంత్‌రెడ్డి, బి. మీన ముత్యాలు, కె.లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, కోఆప్షన్ సభ్యులు జె.లక్ష్మీ రాములు, తాజుద్దీన్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సలహాదారుడు జగదీష్‌చందర్‌రావు, నాయకులు రామలింగారెడ్డి, మాదవరెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున కాలనీ వాసులు పాల్గొన్నారు. అనంతరం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులకు భోజనాలు ఏర్పాటు చేశారు.